


# నీడ తెగిన మనిషి

రెండు గంటలు దాటి ఉండొచ్చు. అయినా

సూర్యుడు తన వేడిమిని చూపలేక పోతున్నాడు. కారణం! సూర్యుడు కనిపించకుండా నల్లగా అడ్డుకొన్న మేఘాలు, ఏదో వింత చూట్టానికన్నట్లుగా పరిగెడుతున్నాయి. పొద్దుటినుంచి ముసురుగా పట్టిన వాన అప్పుడే కొంచెం తగ్గింది. నీరు కాలువలు కట్టి చేరవలసిన చోటు చేరకుంది. గాలికి కదలినప్పుడల్లా చెట్ల ఆకుల నుంచి నీటిబొట్లు టప టప పడుతున్నాయి. ఈ ఇల్లు కట్టడానికి ముందే నాటిన కొబ్బరి చెట్లుఎదిగి తమ అందాన్ని ఇంటికి కూడా కొంచెం పంచుతున్నాయి.

వరండాలో సోఫాలో కాలుమీద కాలు వేసుకొని తాంబూలం తినటంలో సుఖం అనుభవిస్తున్నాడు రామానాయుడు.

దాశరథి విజయలక్ష్మి

—ఆ యింటికి "గృహప్రవేశం జరిగి" ఆ రోజుకు అయిదురోజులు. అయినా వచ్చిన చుట్టాల సందడి తగ్గలేదు. ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ హాయిగా శరీరాలు వాల్చి తాము మోయలేని ఆభరణాలను సర్దుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు ఆడంగులు. ఆ యింటి కిటికీలకు, తలుపులకు వేసిన 'పెయింట్' వాసనలు ఇంకా పోలేదు. కిటికీలకు, గుమ్మాలకు అందంగా అలంకరించిన తెరలు పిల్లగాలి పంపేకబుర్లు ఇంట్లోకి చేరవేస్తున్నాయి.

రామానాయుడి మనస్సు, ఇన్నాళ్లకు హాయిగా ఉంది. ఎన్నోరోజులనుంచి కన్న కలలు ఇన్నాళ్లకు ఒకరూపానికి వచ్చినందుకు ఇంట్లో ఉండే, తానుకట్టుకున్న రెండంతస్తుల భవనాన్ని ఊహించుకున్నాడు. ఎందుకో గర్వం కల్గింది, దానికి గుర్తుగా అన్నట్లు అనుకోకుండానే అతని చెయ్యి మీసంమీదికి వెళ్లింది.

అతని తలమీద చాలాభాగం నెరిసిన వెం ట్రుకలే, అవి అతని వయసుకుగాక అతనికి కాంట్రాక్టులలోగల అనుభవానికి చిహ్నాలు.

—తను ఎన్నో బిల్డింగులు, ఆనకట్టలు, చాలావాటిని కాంట్రాక్టుకి తీసుకొన్నాడు. ఆ ఆనకట్టలలో చాలావరకు కూలిపోయినవే ఎక్కువ! కూలిపోవటానికి కారణాలక మిటి లెన్నోఉన్నా, అతనికి మరోవంతెన కాంట్రాక్ట్ రావటం మామూలుగా జరుగుతూ ఉంటుంది.

—తన ప్రక్కనే ఉన్న పేపరును తీసి మళ్ళీ ఆ వార్త చదివాడు. తను కంట్రాక్ట్ తీసుకొని కట్టించిన ఆనకట్టకట్టి రెండు సంవత్సరాలైనాకాలేదు. అది ఈ చిన్నవానలకే కూలిపోయిందని వార్త.

బాధగానే ఉంది. కానీ తానేం చేస్తాడు? బాధతోనే కూలిపోయిన వాటిలో దీనిని జమ చేశాడు.

—లేచి నుంచొని తిరగటం మొదలు పెట్టాడు. తను కట్టించిన ఆనకట్టలు ఎన్ని కూలినా తనకోసం కట్టించుకున్న ఈ భవనం మాత్రం పదికాలాల పాటు చక్కగా ఉండాలని కోరిక. ఉ టుందని అతని నమ్మకం. ఎందుకంటే తననేర్పరితనం అంతా చూపించి కట్టించుకున్నాడు ఈ భవనాన్ని.

గుమ్మానికి వ్రేలాడుతున్న తెరను తొలగించుకొని బయటికి వచ్చాడు.

అతని కనులు కొంచెందూరాన్ని పరిశీలించాయి. ఇంతలో ముడిపడ్డాయి. అతని కోపానికి చిహ్నంగా అతని కనులు ఎర్రగా మెరిశాయి.

—తను ఈ భవనం కట్టించుకొనేటప్పుడు సామానుకోసం కట్టించిన చిన్నపాకలాంటి ఇంటిమీది సిమెంటురేకు (Asbestos) Sheet) కనిపించలేదు.

ఇంటివాళ్లు ఎవరూ తీయడానికి వీలులేదు, ఎవరో దొంగిలించి ఉ డాలి.

నిన్నటి వరకూ ఉన్న రేకు ఈరోజు ఎలా మాయమయ్యింది.

—అంతు చిక్క లేదు రామానాయుడుకి.

పోనీ సిమెంట్ రేకే కదా! అని ఊరోక్క లేక పోయాడు.

అది చిన్నదొంగతనమైనా, దొంగతనమే!

అయినా తనకు దానితో పనిలేదు.

పనిలేకపోయినా వేరేవాడు దానిని దొంగిలించడం మాత్రం సహించలేక పోయాడు. తన వస్తువు అంటేపో కూడనిదే కావాలి పో కావీ...... వస్తువులకు కాళ్ళురావడం ... వద్దు...దీన్ని వదలకూడదు.

'భీమన్నా'...అరిచాడు.

నిద్రపోతున్న భీముడు లాంటి భీమన్న పైపంచ దులుపుకొని వచ్చాడు.

'ఏందయ్యా'—ఎంత సౌమ్యంగా వలికినా ఆ గొంతులో ఆత్మీయతకు తావులేదు.

నిన్నటివరకూ ఉన్న ఈపాకమీది రేకు ఇవాళ కనిపించటం లేదు.

మనింట్లో దొంగతనానికి ఎవరి కుంటుంది ధైర్యం ?

మొన్నటి వరకు మనదగ్గర పనిచేసిన ఆ కూలివాళ్ళ పనే అయివుంటుంది. వాళ్ల కొంపలన్నీ వెతికి ఎవడిదగ్గరన్నా ఆరేకు కనిపిస్తే ...ఏం చెయ్యాలోతెలుసు గా పండ్లు పట పట కొరికాడు రామానాయుడు.

రోషంగా చేతిలోని కర్ర క్రింద కొట్టి బయలుదేరాడు భీమన్న.

—పూరి గుడిసెల మీది నీళ్లు కారిలోపల కూడా పడుతున్నాయి.

చంటిపిల్లలు, పెద్దలు చలిగాలికి వణికి పోతూ నీళ్లు పడనిచోట్లో కూర్చున్నారు.

వీళ్లందర్నీ, దర్జాగా చుట్ట కాలుస్తూ చూస్తూ కూరున్నాడు, దొంగిలించి తెచ్చుకున్న రేకును తన గుడిసెపై వేసుకున్న మల్లన్న.

ఆ రేకు ఉండబట్టిగాని లేకపోతే తమగతీ వాళ్ళలాగే ఉండేది. కడుపులోకి ఇంత ఆసరా లేకపోయినా నీడపట్టున పడుకోవాటానికి ఈ వేళ దేముడిలా అదుకుంది.

ఈ రేకును సంపాదించటానికి ఎన్ని రోజులు కష్టపడ్డానో... ఆ పనికీ ఈపనికీ ఆపాకదగ్గరికి వచ్చి దాని మేకులన్నీ వదులు చేసిదాన్ని తీరా ఇంటికి తెచ్చి తన ఇంటి మీద వేసే సరికి తాతలు దిగివచ్చారు ...

ఆఁ వాళ్ళకు దాంతో పనేంటి?...అయినా తనే తీసుకొచ్చినట్లు వాళ్లకు ఎం తెలుస్తుంది? తను అక్కడ పని మానేసి అయిదు రోజులయింది, అయినా ఇంత చిన్నదానికి అంత డబ్బునోళ్లు పట్టించుకోరు, ... అనుకుంటూ ఆప్యాయంగా ఆ రేకు కేసి చూసుకున్నాడు.

దాని క్రింద నీడలో ఒళ్లుమరిచి నిద్రపోతున్న అలబిడ్డలను మెరిసే కళ్లతో చూసుకున్నాడు. తానెంతో గొప్పవాడి ననుకున్నాడు మల్లన్న :

— వర్షంలో దూరంగా తన మీదకు వస్తున్న అపాయం సంగతి మల్లన్నకింకా తేలీదు.

* * * *

మల్లన్నను పెదరెక్కలు విరిచికట్టితీసుకు వచ్చి రామానాయుడి కాళ్ళ దగ్గర పడేశారు.

మల్లన్న ఒళ్లు హూనం అయిపోయింది. బురదలో పడి కొట్టుకుంటున్నాడు.

కళ్ల నిండా నీళ్ల...ఒంటి మీది రక్తపు మరకలు బురదలో కలిసిపోయాయి.

అతనికి నిన్నటివరకు ఉన్న తన ఇల్లు గుర్తుకొచ్చింది, తిన్నా తినకపోయినా తనకో నీడినిచ్చే ఇల్లుండేది—కొంచెం ఆశతో రేకు దొంగతనం చేస్తే — మొదటికే మోసం వచ్చింది.

అయినా—తన కోరిక అంత తప్పా? తల దాచుకోవటానికి నీడ కోరటంతప్పా? —నీడ పట్టు మనుషులకుండే అన్ని సౌఖ్యాలు తన కక్కర్లేదు.

—కానీ...

ఈ క్షణంలో ఉన్న నీడా పోయింది—చుట్టూ ఉండే గోడల్లాంటి ఆకారమూ పోయింది — మల్లన్నకు తన హక్కుల్ని ఎవరో దోచుకున్నట్లుగా తోచింది.

చుట్టూ చూస్తే — దూరంగా ఆ రేకు ఓ మూలన—నిశ్శబ్దంగా తన చేతకాని తనానికి చిహ్నమా అన్నట్లు వానలో తడుస్తోంది.

ఈ సారి...మల్లన్న నీడ తెగిన మనిషి కాదు. అతనికి ఎన్నెన్నో కొత్త ఆలోచనలు, అతనికి నీడ నిస్తాయనే నమ్మకం అతనికి కలగసాగింది. *

దేశంలో అత్యావసర పరిస్థితి ఎంత భీభత్సం సృష్టించిందో అందరికీ తెలుసు. అత్యావసర పరిస్థితి గురించి అయిదుమాసాలలో ఆంగ్లంలో 60 పుస్తకాలు వెలువడ్డాయట, మరి తెలుగులో......